క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు



ఎంపీ అనురాధకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సర్పంచ్ రామచంద్రరావు

ఉప్పలగుప్తం: మండలంలోని మునిపల్లి గ్రామ పంచాయతీ పరిధి కోటిగట్టు వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీ చింతా అనురాధ రూ.10 లక్షలు నిధులు కేటాయించారని సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు తెలిపారు. ముగ్గమూరులోని ఎంపీ కార్యాలయంలో గ్రామస్తులతో కలిసి ఆదివారం ఎంపీ అనురాధకు సమస్యను వివరించారు. ఈ మేరకు ఎంపీ స్పందించి నిధులు కేటాయించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్, గ్రామస్తులు ఎంపీకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నిమ్మకాయల హనుమంతు శ్రీనివాసరావు, దోనిపాటి వెంకటేశ్వరరావు, కట్టా సుబ్బారావు, నిమ్మకాయల దుర్గారావు, బుజ్జి, పితాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భాగీర్తమ్మ విగ్రహ ప్రతిష్ఠ



భాగీర్తమ్మ అమ్మవారు

ఐ.పోలవరం: కొమరగిరి పంచాయతీ పరిధి మంగాపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన భాగీర్తమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయ పండితుల ఆధ్వర్యంలో హోమాలు, గోదృష్టి, కుంభం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో దాతల సహకారంతో భారీ అన్న సమారాధన చేశారు.

గోదావరిలో వైభవంగా త్రిశూల స్నానం



త్రిశూల స్నానానికి తరలివచ్చిన భక్తులు

యానాం: యానాంలో కొలువైన శ్రీరాజరాజేశ్వరీ సమేత రాజరాజేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం గౌతమీగోదావరిలో స్వామివారి త్రిశూల స్నానం వైభవంగా నిర్వహించారు. వేంకటేశ్వర దేవస్థానం ఆలయ సముదాయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మహిళలు అధికసంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కాపగంటి ఉమాశంకర్, వైస్ ప్రెసిడెంట్ యాళ్ల మీరయ్య, తుపాకుల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం



ముత్యాలమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి పవిత్ర మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి రంగాచార్యులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. పి.మల్లవరం మాజీ ఎంపీటీసీ సభ్యుడు పంపన చంద్రరావు, సరోజ కుమారి దంపతులచే క్షీరాభిషేకం కార్యక్రమాన్ని చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు విళ్ల సత్యన్నారాయణ, విళ్ల వీర, ఉంగరాల వెంకటేశ్వరరావు, పంపన విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మాఘ పౌర్ణమి పూజలు



గోపవరంలో ప్రత్యేక అలంకరణలో ఉమారాజలింగేశ్వర స్వామి

ఉప్పలగుప్తం: పవిత్ర మాఘ పౌర్ణమి సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఎస్.యానం సముద్ర తీరంలో భక్తులు ఆదివారం ఉదయాన్నే నదీ స్నానాలను ఆచరించారు. గోపవరంలో ఉమారాజలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు వెల్లంపల్లి అబ్బన్నశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను కూరగాయలతో అలంకరించారు. విలసవిల్లి మహాసౌరయాగంలో ఆదిత్యుడికి ప్రత్యేక పూజలు జరిపారు. పుష్యమి నక్షత్ర జాతకులచే రావిమొక్కకు పూజలు చేశారు.

కైలాస భూమికి మోక్షం



శుభ్రం చేసిన కైలాస భూమి

అమలాపురం టౌన్: కరోనా సమయంలో ఆ కైలాస భూమిలో ఎన్నో శవాలకు అంత్యక్రియలు జరిగాయి. అమలాపురం బైపాస్ రోడ్డులో పంట కాలువ చెంత ఉన్న ఈ కైలాసభూమిలో అప్పట్లో రోజుకు పదికి తక్కువ కాకుండా కరోనా వైరస్ మృత దేహాలకు అంత్యక్రియలు చేశారు. ఆ వైరస్‌తో మృతి చెందిన దాదాపు 400 మృతదేహాలకు ఇక్కడ కార్యక్రమాలు పూర్తి చేశారు. అధిక సంఖ్యలో కరోనా మృతులకు ఇక్కడ అంత్యక్రియలు జరగడంతో ఆ వైరస్ తగ్గిన తర్వాత కూడా సాధారణంగా మరణించిన వారిని ఇక్కడ అంతక్రియలు చేసేందుకు సంబంధిత కుటుంబీకులు, బంధువులు ఆసక్తి చూపే వారు కాదు. దీంతో ఇది రెండున్నరేళ్లుగా మూతపడింది. అప్పటి నుంచి ఎవరైనా చనిపోతే 1 నుంచి 12 వార్డుల ప్రజలు ఇక్కడ ఉన్న కైలాస భూమిని కాకుండా దాని బయట ఉన్న బహిరంగ ప్రదేశంలో అంత్యక్రియలు చేస్తున్నారు. రెండున్నరేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఈ కైలాసభూమిని పునరుద్ధరించాలని గత నెల 27న జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కొందరు కౌన్సిలర్లు చర్చకు తెరతీశారు. దీనిపై స్పందించిన మున్సిపాలిటీ మూతపడిన కైలాసభూమిని పరిశుభ్రం చేసి.. బ్లీచింగ్ చల్లించి వాడుకలోకి తెచ్చేలా సిద్ధం చేసింది. ఆ వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ వారం రోజులుగా శుభ్రం చేసే పనులు చేయిస్తున్నారు. ఇక నుంచి ఎప్పటిలాగే వినియోగించేలా సిద్ధం చేశారు.

పంట కాలువలో జంతు కళేబరాలు



చల్లపల్లి ప్రధాన కాలువలో స్లూయిజ్ వద్ద అడ్డుపడిన కళేబరాలు

ఉప్పలగుప్తం: అమలాపురం నుంచి చల్లపల్లి మీదుగా ప్రవహించే ప్రధాన పంట కాలువలో తరచూ జంతువుల కళేబరాలు తేలుతూ వస్తున్నాయి. ఇటీవల అంతుచిక్కని వైరస్‌తో పందులు మృత్యువాత పడుతున్నాయి. వీటిని కాలువల్లో పడేస్తున్నారు. మండలంలోని చల్లపల్లి ప్రధాన పంట కాలువలో తాగునీటి ప్రాజెక్టుకు వెళ్లే స్లూయిజ్ వద్ద చనిపోయిన జంతు వ్యర్థాలు అడ్డుపడి విపరీతమైన దుర్వాసన రావటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చల్లపల్లి, కూనవరం తాగునీటి ప్రాజెక్టులపై మండలంలోని 12 గ్రామాలు ఆధారపడి ఉన్నాయి. ప్రజలు ఈ నీటినే వాడుతున్నారు. వైరస్‌తో చనిపోయిన జంతువులను కాలువలో పడేయటంతో రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వాణీ జయరాం మృతికి సంతాపం

తాళ్లరేవు: ప్రముఖ గాయని వాణీ జయరాం మృతి సినీరంగానికి తీరని లోటని ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎస్వీఆర్, మహానటి సావిత్రి కళావేదిక అధ్యక్షుడు ఉంగరాల వెంకటేశ్వరరావు అన్నారు. వాణీ జయరాం మృతికి కళాకారులు వాకపల్లి చిరంజీవి, బస్సా రమణ, చింతలపూడి కేశవరావు, తుపాకుల ప్రసాదరావు, వడ్డి ఏడుకొండలు తదితరులు సంతాపం తెలియజేశారు.

వర్తక సంఘాల సమస్యల పరిష్కారానికి కృషి



మంత్రి విశ్వరూప్‌ను సత్కరిస్తున్న బులియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రతినిధులు

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం టౌన్: వర్తక సంఘాల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి ఎప్పుడూ ఉంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం బులియన్ అసోసియేషన్(బంగారు, వెండి వర్తకులు)కు ఎన్నికై న నూతన కార్యవర్గ ప్రతినిధులు మంత్రి విశ్వరూప్‌ను శనివారం రాత్రి స్థానిక కాటన్ అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ బంగారు వర్తకులతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం బులియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రతినిధులను మంత్రి అభినందించారు. అసోసియేషన్‌కు తన ప్రోత్సాహం, సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరఫున మంత్రి విశ్వరూప్‌ను సత్కరించారు. మంత్రి విశ్వరూప్‌ను కలిసినవారిలో అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, గౌరవాధ్యక్షుడు రేకపల్లి సూరిబాబు, కార్యదర్శి రాయుడు నాని, కోశాధికారి చవాకులు కృష్ణ, ఉపాధ్యక్షుడు మద్దింశెట్టి ప్రసాద్, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మానే ప్రకాష్, చింతలపూడి సత్తిబాబు తదితరులున్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల విజేతలకు సత్కారం



క్రీడాకారులను సత్కరిస్తున్న అసోసియేషన్ల ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన నలుగురు కోనసీమ జిల్లా క్రీడాకారులకు స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పి.వందన 81 కేజీల విభాగంలో వెండి పతకాన్ని, బి.యశ్వంత్ 66 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని, డి.వేణుసాగర్ 102 ప్లస్ కేజీల విభాగంలో బంగారు పతాకాన్ని సాధించారు. శ్రీకాకుళం జిల్లా రాజాంలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఎం.నరేంద్ర 89 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఈ నలుగురి క్రీడాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు దొమ్మేటి వెంకటరమణ, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎనుముల కృష్ణ పద్మరాజు, కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి పునఃప్రతిష్ఠా మహోత్సవాలు

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది బీసీ పేటలో పునర్‌నిర్మించిన సీతారామాలయంలో పునఃప్రతిష్ఠా మహోత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణకర్త కుడుపూడి శివన్నారాయణ తెలిపారు. 7వ తేదీన విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, వాస్తుపూజ, అంకురార్పణ, 8న నవకలశారాధన, స్వామివారి ఊరేగింపు, 9వ తేదీ ఉదయం 8.51 నిమిషాలకు నూతన విగ్రహాల పునఃప్రతిష్ఠ చేయనున్నామన్నారు. ఆయా కార్యక్రమాలకు భక్తులు తరలివచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పేకాడుతున్న ఇద్దరి అరెస్ట్

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామ సమీపంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాస కుమార్ తెలిపారు. స్థానిక ఏటిగట్టు రహదారిలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి దాడి చేయగా ఇద్దరు వ్యక్తులు పట్టుపడ్డారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. పేకాట, జూదం, కోడి పందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

సాగు నీరందేలా చర్యలు చేపట్టాలి

ఉప్పలగుప్తం: రబీ సాగుకు శివారు ప్రాంతాలకు నీరందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అగ్రికల్చర్ సభ్యుడు జిన్నూరి రామారావు(బాబి) అన్నారు. మండలంలోని స్థానిక గ్రామ పరిధిలో పేరాయిచెరువు, ఆదిలక్ష్మీపురం ప్రాంతాలకు సాగు నీరందక రబీ సాగుకు ఆటంకంగా మారిందని ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్‌తో మాట్లాడామని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాలువలు ఆధునికీకరణ చేసే ప్రక్రియలో ఒకే ఒక కాంట్రాక్టర్‌కు ఇవ్వకుండా చిన్న చిన్న వర్క్‌లుగా విభజించి ఇవ్వాలని కోరారు.

బీజేపీ ఆధ్వర్యంలో రవిదాస్ జయంతి

అమలాపురం రూరల్: బీజేపీ పట్టణ కార్యాలయంలో ఆదివారం ప్రముఖ కవి సంత్ రవిదాస్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్ రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పశుగణన అభివృద్ధి సంస్థ చైర్మన్ యాళ్ల దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆకుమర్తి బేబీ రాణి, బీజేపీ సీనియర్ నాయకుడు ఆర్వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఫిట్ ఇండియా' సెలబ్రేషన్స్‌కు హాజరుకానున్న ఎంపీ

యానాం: యానాంలో నిర్వహిస్తున్న ఫిట్ ఇండియా స్కూల్ వీక్ సెలబ్రేషన్స్ ముగింపు కార్యక్రమానికి పుదుచ్చేరి పార్లమెంట్ సభ్యులు వి.వైద్యలింగం ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) యానాం సెంటర్ ఇన్‌ఛార్జి జి.లింగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హైస్కూల్, మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్ క్యాంపస్‌ల్లో ఈ నెల 6వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు జరిగే ఫిట్ ఇండియా స్కూల్ వీక్ సెలబ్రేషన్స్ ముగింపు వేడుకలకు ఎంపీ వైద్యలింగం హాజరవుతారన్నారు.

ఎంపీ వైద్యలింగం పర్యటన విజయవంతం చేయండి

యానాం నియోజకవర్గంలో సోమవారం జరిగే పుదుచ్చేరి పార్లమెంట్ సభ్యులు, మాజీ ముఖ్యమంత్రి వి.వైద్యలింగం పర్యటనను విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంపై అధికారులతో సమీక్షా సమావేశం జరగనుందన్నారు. జిప్‌మెర్ ఆసుపత్రి, గిరియాంపేటలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల పనులను ఆయన పరిశీలిస్తారని చెప్పారు.

యువతతో దేశం స్వయం సమృద్ధి సాధించాలి

స్వావలంబి భారత్ అభియాన్ ఏపీ సంయోజక్ శ్రీనివాస్



అమలాపురంలో జిల్లా ఉపాధి కల్పన అవగాహన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌బీఏ ప్రతినిధులు

అమలాపురం టౌన్: విద్యార్థులు, యువత ద్వారా దేశం స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో స్వావలంబి భారత్ అభియాన్ (ఎస్‌బీఏ) ఏర్పడిందని ఆ సంస్థ ఏపీ ప్రాంత సంయోజక్ జి.అంజనీ శ్రీనివాస్ వెల్లడించారు. ఎస్‌బీఏ ఆధ్వర్యంలో స్థానిక అప్పారివారి గూడెంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి అంజనీశ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఉపాధి కల్పనా అవగాహన కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో 101 జిల్లాల్లో జిలా ఉపాధి కల్పన అవగాహన కేంద్రాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. యువతకు ఉద్యోగ అవకాశాల గురించి సమాచారం అందించడం, ఇతర సాంకేతిక సదుపాయాలు కల్పించడం వంటి సహకారాన్ని ఎస్‌బీఏ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వి.బలరామకృష్ణ, బులుసు జగదీష్, చెల్లింగి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాబా విగ్రహాల ప్రతిష్ఠ



ఆశ్రమంలో సద్గురు ప్రహ్లాద బాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

అల్లవరం: కొమరగిరిపట్నం తోటల పండరి ప్రహ్లాద బాబా ఆశ్రమంలో సద్గురు ప్రహ్లాద బాబా స్వామి వారి పంచలోహ విగ్రహం షిరిడీ సాయి, సత్యసాయిబాబా విగ్రహాలను ఆదివారం ప్రతిష్ఠించారు. వేద పండితులు మానేపల్లి భాస్కరశర్మ, పురోహితులు పోచినపెద్ది వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రహ్లాద బాబా ఆశ్రమంలో వేద మంత్రాల నడుమ అత్యంత వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో యాళ్ల దొరబాబు, యాళ్ల వెంకటానందం, నడింపల్లి సీతారామరాజు, డాక్టర్ కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌లో విశిష్ట సేవలకు అవార్డులు



లయన్స్ క్లబ్ ప్రతినిధులకు అవార్డులను ప్రదానం చేస్తున్న పూర్ణిమ

అల్లవరం: డయాబెటిస్, విజన్, ఎన్విరాన్‌మెంట్ విభాగాలు, వరదల సమయాల్లో సేవలందించిన లయన్స్ క్లబ్ వశిష్ఠ, అమలాపురం, యానాం, రావులపాలెం, ధవళేశ్వరం, బొమ్మూరు క్లబ్‌ల ప్రతినిధులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించారు. రీజియన్ లయన్ చైర్‌పర్సన్ మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ అధ్యక్షతన బోడసకుర్రులోని బీఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో జ్యోతి ప్రజల్వన కార్యక్రమంతో అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాల్లకూరి శైలజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సొంత లాభం కొంతమాని పరుల కొరకు పాటుపడవోయ్ అన్న గురజాడ మాటలను ప్రతి ఒక్కరూ పాటించాలని వక్తలు అన్నారు.

అమలాపురంలో ఆక్వా రైతుల సమావేశం

అమలాపురం రూరల్: అమలాపురం క్షత్రియ కల్యాణ మండపంలో ఆక్వా రైతుల సమస్యలపై చర్చించేందుకు ఆదివారం కోనసీమ ఆక్వా రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కోనసీమ ఆక్వా రైతుల సంఘం అధ్యక్షుడు రుద్రరాజు నానిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు చవటపల్లి నాగభూషణం, నానిరాజులు మాట్లాడుతూ సోమవారం స్పందనలో జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి కలెక్టర్‌కు తమ సమస్యలపై ఫిర్యాదు చేస్తామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆక్వా రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు నాయకులు రమేష్ రాజు, సూరిబాబు రాజు, సత్తిబాబు రాజు, కాశీ రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ రాక

అమలాపురం రూరల్: ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ బి.సత్యనారాయణ మంగళవారం కోనసీమలో పర్యటించనున్నారని ఏపీఈపీడీసీఎల్ డివిజనల్ ఈఈ మోకా రవికుమార్ తెలిపారు. వేదిక చైర్మన్ విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ, వేదిక సభ్యులు ఎస్.హరిబాబు, డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్‌లు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకూ ముమ్మిడివరంలోని శ్రీనివాసా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో అవగాహన సదస్సు, అనంతరం ఈదరపల్లిలో ఏపీఈపీడీసీఎల్ ఈఈ కార్యాలయంలో విద్యుత్ వినియెగదారుల సమస్యలపై పరిష్కార వేదిక నిర్వహిస్తారని చెప్పారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

అమలాపురం రూరల్: ఇమ్మిడి వరప్పాడు వృద్ధాశ్రమంలో ఆదివారం గుళ్లపల్లి వెంకటరామయ్య మహాలక్ష్మి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షుడు గుళ్లపల్లి సత్యనారాయణ తన భార్య పద్మావతి కామేశ్వరి పేరు మీద వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకులు రాపాక విక్టర్ డానియేలు, పామర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

'మన ఓడలరేవు చరిత్ర' పుస్తకావిష్కరణ



'మన ఓడలరేవు చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించిన దొరబాబు తదితరులు

అల్లవరం: ఓడలరేవు గ్రామానికి చెందిన రేకాడి సముద్రుడు రచించిన 'మన ఓడలరేవు చరిత్ర' పుస్తకాన్ని రాష్ట్ర బీజేపీ కార్యదర్శి, ఆల్డా చైర్మన్ యాళ్ళ దొరబాబు చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు కడలి త్రిమూర్తులు అధ్యక్షతన ఓడలరేవు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయులు కోలా అర్జునరావు పేరిట సేవా సమితిని సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ ప్రారంభించారు. సేవా సమితి పేరిట రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ వేశారు. కార్యక్రమంలో కొల్లు బాబ్జీ, రేకాడి సత్యనారాయణవర్మ, పాల వర్మ, చొల్లంగి రాధాకృష్ణ, పాల వెంకటేశ్వరరావు, తారాడి శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం



వీరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న చండీ హోమం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి తిథిని పురస్కరించుకొని భద్రకాళి అమ్మవారికి చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో చండీ పారాయణ, చండీ హోమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో వీరభద్రుని బోనాలు



పల్లకీలో వీరభద్రస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం గణేశుల వారి వీరభద్రుని బోనాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కులదైవంగా భావించే వీరభద్రుని ప్రతిరూపాన్ని పల్లకీలో పెట్టుకుని ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక షిర్డీసాయిబాబా ఆలయం వద్ద పంటకాలువలో స్నానం చేయించారు. అనంతరం జమ్మిచెట్టు వద్ద స్వామివారి బోనాలు కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గోదశి నాగేశ్వరరావు, గణేశుల బ్రహ్మనందం, కౌన్సిలర్ గణేశుల అరుణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఎమ్మెల్యే పొన్నాడకు కృతజ్ఞతలు

తాళ్లరేవు: ఏళ్లనాటి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మైక్రోఫిల్టర్‌ను మంజూరుచేయడంతో పాటు వాటి పనులు మొదలుపెట్టినందుకు ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌కు జార్జిపేట గ్రామస్తులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం స్థానిక పంచాయతీ వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం రూ.15 లక్షల ఖర్చుతో మైక్రోఫిల్టర్ ఎక్విప్‌మెంట్‌ను మంజూరు చేశారని, దీంతో రోజుకు 3 లక్షల లీటర్ల శుద్ధి చేసిన తాగునీరును గ్రామస్తులకు అందించడానికి వీలు కలుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ గ్రామ కమిటీ కన్వీనర్ రెడ్డి నాగు, సర్పంచ్ పేర్ని ఆదినారాయణ, ఎంపీటీసీ మందపల్లి నాగమ్మ, రాంబాబు, కానూరి బాబి తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విద్యుత్ కనెక్షన్లకు ఆధార్ అనుసంధానం

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం ఇస్తున్న రాయితీ విద్యుత్ కనెక్షన్లకు వినియోగదారులు ఆధార్ నెంబరుతో అనుసంధానం చేసుకోవాలని విద్యుత్‌శాఖ కార్యదర్శి ఎస్.మురుగేశన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా 50 శాతం రాయితీతో విద్యుత్ ఇస్తున్న అన్ని గృహాలకు(ఎ2), తాటాకు గృహాలకు, ఒక బల్బు ఒక గుడిసె పథకం పొందుతున్నవారు, నెలవారీ 100 యూనిట్ల కన్నా తక్కువ ఖర్చు చేస్తున్న వినియోగదారులు, వ్యవసాయ పంపు సెట్లకు 100 శాతం రాయితీ పొందుతున్నవారు తమ ఆధార్ నెంబరును అనుసంధానించాలన్నారు. ప్రభుత్వ విద్యుత్ రాయితీల్లో పారదర్శకత కోసమే ఆధార్ అనుసంధానాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు.

గంజాయి తాగుతూ పట్టుబడ్డ యువకుడు

అమలాపురం టౌన్: స్థానిక సావరంలో కొమ్మోజు నాగ సూర్య శివప్రసాద్ అనే 21 ఏళ్ల యువకుడు గంజాయి తాగుతూ ఎస్ఈబీ సిబ్బందికి ఆదివారం పట్టుబడ్డాడు. స్థానిక అన్నాబత్తుల వారి వీధికి చెందిన శివప్రసాద్‌ను అరెస్ట్ చేయడంతో పాటు అతని వద్ద నుంచి 26 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ వేగిశ్న శివరామరాజు తెలిపారు. నిందితుడిని అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారని చెప్పారు. గంజాయి సేవించడం, కలిగి ఉండడం, రవాణా చేయడంపై పూర్తి నిఘా పెట్టామని సీఐ స్పష్టం చేశారు. ఎస్ఈబీ ఎస్ఐ స్వామిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సీతారామరాజు, కానిస్టేబుళ్లు కరుణ, తాతారావు తదితరులు దాడిలో పాల్గొన్నారు.

10న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మాక్ డ్రిల్

యానాం: ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వ యంత్రాంగంలోని వివిధ శాఖలు ఏ విధంగా అప్రమత్తం కావాలో తెలిపేలా ఈ నెల 10వ తేదీన మాక్‌డ్రిల్‌ను నిర్వహించనున్నట్లు ఆర్ఏఓ మునిస్వామి ఆదివారం తెలిపారు. మాక్ డ్రిల్‌ను నిర్వహించే గౌతమీగోదావరి రివర్‌బీచ్ ప్రాంతం, మార్కెట్ ఆవరణ, కేఎస్‌పీవీఆర్ ప్రాథమిక పాఠశాల తదితర ప్రాంతాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో టి.రవిశంకర్, సీఐ గూటం శివగణేష్, డీటీ సత్యనారాయణన్, విద్యుత్‌శాఖ ఏఈ లంక కృష్ణారావు, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

చేయి చేయి కలుపుదాం

అల్లవరం: చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ అయితాబత్తుల సుభాషిణీ పిలుపునిచ్చారు. మండలంలోని శిరగట్లపల్లిలో ఆదివారం హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమ కరపత్రికలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో సాధనాల చిన సత్యనారాయణ, రొక్కాల సత్యనారాయణ, మొల్లేటి వెంకటేశ్వరరావు, చేగొండి సూరిబాబు, కుసుమ కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.